సామాన్యుడి ఆయుధం

T/AP/2024/0304/1072/41

# ప్రజల అస్త్రం

తెలుగు దినపత్రిక

ANDHRA PRADESH

prajalaastram999@gmail.com

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ సంపుటి: 1 సంచిక: 294 పేజీలు: 6 ఆదివారం 9 -3-2025 వెల: 5/రూ -



**విలేకరులు కావలెను..**

అస్త్రం తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్స్, నియోజకవర్గ ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు కావలెను.. సీనియర్ రిపోర్టర్స్ కి ప్రాధాన్యత ఇవ్వబడును.. మరిన్ని వివరాలకు సంప్రదించండి.

ఎడిటర్. 89193 45606


## అతివలకు బీఎన్ఎస్ రక్షణ ఛత్రం..

**ప్రపంచంలో నేనే అధిక సంపన్నుడిని**

**కోట్ల మంది మహిళామణుల ఆశీస్సులు నా సొంతం.. అవే నా సంపద, బలం**

**మహిళా దినోత్సవ సభలో ప్రధాని మోదీ**

నవ్‌సారి, మార్చి 8: మహిళల భద్రతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. వారిపై జరిగే నేరాల కట్టడికి కఠిన చట్టాలు రూపొందించడంతోపాటు నియమ, నిబంధనలను కూడా కఠినతరం చేశామని వెల్లడించారు. మహిళలపై అత్యాచారానికి పాల్పడడం సహా అమానుషాలకు ఒడిగట్టే వారికి ఉరిశిక్ష విధించేలా చట్టాలను రూపొందించినట్టు తెలిపారు. బ్రిటీష్ కాలంనాటి ఐపీసీ సెక్షన్ స్థానంలో తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)..



2లో

## గుజరాత్ కాంగ్రెస్ లో బీజేపీ కోవర్టులు

**అవసరమైతే 40 మందిపై వేటు: రాహుల్**



అహ్మదాబాద్, మార్చి 8: గుజరాత్ కాంగ్రెసలోని కొందరు నేతలు బీజేపీ కోసం పనిచేస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అవసరమైతే 30-40 మంది నాయకులపై వేటు వేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టంచేశారు. కనీసం 5్న ఓట్లు పెంచుకోగలిగితే రాష్ట్రంలో



## చంద్ర గ్రహణం తొలగి ఆడబిడ్డలకు స్వేచ్ఛ.. వెలుగు

- వడ్ల నిల్వకు గోదాములు కూడా మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మండలానికి ఒకటి చొప్పున నిర్మాణం
- మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకిచ్చే బాధ్యత సంఘాలకే
- ధాన్యం బొక్కుతున్న పందికొక్కులకు జవాబిదే..
- వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలే యజమానులు
- వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి వారికే
- టన్నెల్ కూలినా.. పంట ఎండినా బీఆర్ఎస్ నేతల
- ఇందిరా మహిళా శక్తి మిషన్ పాలసీ ఆవిష్కరణ మహిళా సంఘాలకు రూ.22,794 కోట్ల చెక్కు

హైదరాబాద్, రాబోయే రోజుల్లో ప్రతి మండల కేంద్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, గోదాములు ఏర్పాటు చేసే బాధ్యతను తాను తీసుకుంటానని సీఎం రేవంత్ చెప్పారు. ఐకేపీ కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్న వడ్లను రాబోయే రోజుల్లో వారే నిల్వ చేసుకునేలా స్థలాలు ఇచ్చి, గోదాములు కట్టిస్తామని తెలిపారు. అలాగే, ఆ వడ్లను మిల్లింగ్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యతను మహిళా సంఘాలకే అప్పగిస్తామని వెల్లడించారు. ఇందుకు మండలానికో రైస్ మిల్లును నిర్మించి మహిళా సంఘాలకు ఇస్తామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా

- మిగతా 2వ పేజీలో

# ఏడాదిలో లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం



- ఇంటికో ఎంటర్‌ప్రెన్యూర్, ఏఐ ఉండాలి
- వెలిగొండకు కృష్ణా, గోదావరి జలాలు
- ఆడబిడ్డలు స్వేచ్ఛగా తిరిగేలా భరోసా
- వారి రక్షణ కోసం శక్తి టీమ్ యాప్
- మహిళలకు పెట్టుబడుల్లో 45% రాయితీ
- ఎన్ని కాన్పులకైనా ప్రసూతి సెలవులు
- ఎందరు పిల్లలున్నా తల్లికి వందనం
- మార్కాపురంలో మహిళా దినోత్సవ సభ

ఒంగోలు : ఇంటికొక పారిశ్రామికవేత్త ఉండాలన్నది తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అందులో భాగంగానే రానున్న ఏడాది కాలంలో లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేసే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా మార్కాపురంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులపై ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. వివిధ సంస్థలతో ఒప్పందాలు, లబ్ధిదారులకు యూనిట్ల పంపిణీ అనంతరం

- మిగతా 2వ పేజీలో



## మరింత కష్టపడాల్సి వస్తోంది

- మా రాష్ట్రానికి ఆయనే అడ్వాంటేజ్
- జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేం
- సీఎం కొడుకును కావడం వల్ల
- మహిళా దినోత్సవం రోజూ జరపాలి
- 'ఇండియా టుడే' కాంక్లేవ్‌లో మంత్రి

న్యూఢిల్లీ, కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై, తెలంగాణకు హైదరాబాద్ అడ్వాంటేజ్‌గా ఉంటే.. ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ఉన్నారని మంత్రి లోకేశ్ అన్నారు. ముఖ్యమంత్రిని తమకు టాస్క్‌మాస్టర్‌గా అభివర్ణించారు. అందరూ తనలాగే వేగంతో పనిచేయాలని ఆశిస్తుంటారని తెలిపారు. అసెంబ్లీ నిబంధనలను కాదని వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని తేల్చిచెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో

మిగతా 2లో

## అసైన్డ్ భూమిపై ఆ 'షరతు'ను అధికారులే నిరూపించాలి

**దలాయింపు చేయరాదన్న నిబంధనతోనే అసైన్ చేసినట్లు ఆధారాలు చూపాలి**

**లేదంటే షరతు లేనట్లే.. అసైన్డ్ భూమి బదలాయింపుపై ఉన్న నిషేధం వర్తించదు**

**కానూరులోని 0.66 సెంట్ల అసైన్డ్ భూమి విషయంలో హైకోర్టు కీలక తీర్పు**

**పెనమలూరు తహసీల్దార్ ఇచ్చిన ఉత్తర్వులు రద్దు**

అమరావతి: అసైన్డ్ భూమి రిజిస్ట్రేషన్ విషయంలో అధికారుల తీరును రాష్ట్ర హైకోర్టు తప్పుబట్టింది. 18.6.1954కి ముందు నిరుపేదలకు.. "ఎవరికీ బదలాయింపు (అన్యాక్రాంతం) చేయరాదన్న" షరతుతోనే భూములను అసైన్డ్ చేసినట్లు నిరూపించాల్సిన బాధ్యత అధికారులదేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఆధారాలను సమర్పించలేకపోతే, అసైన్డ్ భూమి విషయంలో అలాంటి షరతు ఏదీ లేదనే భావించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.






మిగతా 2లో

## పరిష్కారానికి పదేళ్లలో బీఆర్ఎస్ ప్రయత్నించలేదు

- కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నా ఫలితం ఉండడం లేదు
- అందుకే ఎంపీల భేటీ ఏర్పాటు చేశాం: భట్టి

హైదరాబాద్, : కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల అనుమతు లు, నిధులు, విభజన సమస్యల పరిష్కారం కోసం రాజకీయాలకతీతంగా ఎంపీలంతా ఏకం కావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అనుమతులు గత దశాబ్ద కాలంలో పెండింగ్‌లో ఉండిపోయాయని తెలిపారు. వీటిని రాబట్టడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో పెద్దగా ప్రయత్నాలు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన

## క్యాబినెట్ ఆమోదానికి రంగం సిద్ధమవుతోంది

**భూసేకరణకు నిధుల్లేవన్నా.. గడ్కరీకి చెప్పి ఒప్పించాను**

**వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి**

**కాంగ్రెస్ విఫల గ్యారంటీలను మాపై రుద్దడమేంటి?**

**తెలంగాణ బాస్ బీజేపీ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఉప పార్టీలు**

**మహిళా దినోత్సవం రోజున అఖిలపక్ష సమావేశమా?**

**ముందస్తు కార్యక్రమాల వల్లే మేం వెళ్లలేదు: కిషన్‌రెడ్డి**



2లో

# ఏడాదిలో లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మహిళలతో ఆయన చర్చావేదిక నిర్వహించారు. వివిధ అంశాలపై వారడిగిన ప్రశ్నలకు జవాబిచ్చారు. ఆయా రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, తీసుకుంటున్న చర్యలనూ వివరించారు. 'డ్వాక్రా సంఘాల ఏర్పాటు అనంతరం పేదల జీవితాల్లో అనేక మార్పులొచ్చాయి. ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధిలో మహిళలు కీలకమయ్యారు. డ్వాక్రా ఉత్పత్తుల విక్రయాలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యంలో వారిని మరింతగా ప్రోత్సహించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ఆలోచన చేశాం. అవసరమైన శిక్షణ, నైపుణ్యాభివృద్ధితోపాటు పెద్దఎత్తున రాయితీలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో పురుషులకు 20% రాయితీ ఇస్తుండగా.. మహిళలకు 45% ఇవ్వబోతున్నాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలోనూ శిక్షణ ఇస్తాం. మహిళలు ఆన్‌లైన్ కోర్సులు చేయాలి' అని సూచించారు. ప్రస్తుతం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2.68 లక్షలని, 2047 నాటికి 58 లక్షలు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఇంకా ఏమన్నారంటే.. ఆడబిడ్డల రక్షణకు ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తుంది. వారిని వేధించేవారికి. అత్యాచారాలు చేసేవారికి అదే ఆఖరి రోజు అవుతుంది. వారి వెన్నులో వణుకు పుట్టేలా ప్రభుత్వం వ్యవహరిస్తుంది. వారి ప్రవర్తనకు కారణమైన గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నాం. మహిళల రక్షణ కోసం ఈ రోజే శక్తి టీమ్ యాప్ ప్రారంభించాం. ఆపదలో ఉన్న వారు ఆ సేవలను వాడుకోవాలి. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ వద్దని గతంలో ప్రచారం చేసిన నేను.. ఇప్పుడు ఎక్కువ మందిని కనాలని చెబుతున్నాను. మారిన పరిస్థితులకు అనుగుణంగా అందరూ జనాభావృద్ధిపై దృష్టి పెట్టాలి. ఎక్కువ మంది పిల్లలుంటే చదువులకు అధిక ఖర్చు అవుతుందని భావిస్తారు. అందుకే ఎంతమంది పిల్లలుంటే.. అంతమందికీ ఏటా రూ.15 వేలు తల్లికి వందనం పేరుతో ఇవ్వనున్నాం. గతంలో మహిళా ఉద్యోగులకు రెండు కాన్పుల వరకే ప్రసూతి సెలవులు ఉండేవి. ఇక నుంచి ఎన్ని కాన్పులకైనా ప్రసూతి సెలవులు ఇస్తాం. కట్టెల పొయ్యిపై వంట చేసే సమయంలో ఆ పొగ వల్ల నా తల్లి కంట్లో కన్నీరు చూశాను. అలా ఏ అమ్మా ఇబ్బందిపడకూడదనే గ్యాస్ కనెక్షన్లు అందించాం. ప్రస్తుతం ధరలు పెరగడంతో మళ్లీ కొందరు కట్టెల పొయ్యి వైపు చూడడం గుర్తించి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం.

**పూర్తిచేయకుండానే ప్రారంభించాడు..**

వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయకుండానే ఎన్నికల్లో లబ్ధి కోసం గత సీఎం దానిని ప్రారంభించాడు. నిజానికి ఆ ప్రాజెక్టుకు నేనే శంకుస్థాపన చేశా. నేనే ప్రారంభిస్తా. కృష్ణా జలాలతోపాటు అవసరమైతే పోలవరం-బనకచర్ల పథకం ద్వారా గోదావరి నీటిని కూడా తరలించి ఈ ప్రాంత సాగు, తాగునీటి ఇక్కట్లు తీరుస్తాం. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం.

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన 12 మంది మహిళలను చంద్రబాబు సత్కరించారు. వారిలో డి.సుమతి రామ్మోహన్‌రావు (మృదంగం), శారదా రామకృష్ణ (కూచిపూడి), బాలాత్రిపుర ప్రసూన (రిపోర్టర్), పి.విజయలక్ష్మి (కల్చరల్), ఎస్.భారతి (హరికథ), నడిపల్లి రత్నకుమారి (విద్యారంగం, కెనడీ స్కూల్స్), ఎం.స్వర్ణలతాదేవి (సోషల్ సర్వీసు), టి.వసంతలక్ష్మి (సేవలు), శిరీష (యోగా), ఎన్.ఫణిరత్న (హోంగార్డు), కృష్ణకుమారి (రచయిత్రి), మంజుల (గాత్ర సంగీతం) ఉన్నారు. కార్యక్రమంలో మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, ఆనం రామనారాయణరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**నా భార్యను చూసి గర్వపడుతున్నా..**

ఇంటి పనులు కూడా తెలియని నా భార్యను వ్యాపారంవైపు ప్రోత్సహించా. అయిష్టంగానే ఆ రంగంలో అడుగుపెట్టిన ఆమె హెరిటేజ్ సంస్థను అత్యున్నత స్థానంలో నిలిపింది. నేడు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సేవలు విస్తరిస్తున్న ఆమెను చూసి గర్వపడుతున్నా. డ్వాక్రా సంఘాలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, వారి ఉత్పత్తుల అమ్మకాలు, స్వయం ఉపాధికి సంబంధించి 24 సంస్థలతో సీఎం సమక్షంలో సెర్ప్ అధికారులు ఎంవోయూలు చేసుకున్నారు. మహిళ రక్షణ కోసం ఉద్దేశించిన శక్తి యాప్, పీ4జీపీ పథకాలను చంద్రబాబు ప్రారంభించారు. వివిధ రంగాల్లో రాణించిన 10 మంది ఎస్‌హెచ్‌జీ మహిళల విజయగాథలతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 14,705 సంఘాలకు రూ.1,826.43 కోట్లు, స్త్రీనిధి కింద రూ.వెయ్యి కోట్ల రుణాలను పంపిణీ చేశారు. పలువురు డ్వాక్రా మహిళలను సన్మానించారు. 'మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు పెరుగుతున్నాయి. తదనుగుణంగా పార్టీలోనూ నాయకురాళ్లు పెరగాలి. అందుకే ఇక పార్టీ పదవుల్లో వారికి సగం ఇవ్వబోతున్నాను' అని చంద్రబాబు ప్రకటించారు. డబ్బు, కులపిచ్చి కోసం వైసీపీ వారితో లాలూచీ పడేవారిని సహించనని టీడీపీ నేతలను హెచ్చరించారు. పనిచేయని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను వదలనని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం మార్కాపురంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతమంది కార్యకర్తల్లో ఒకే ఒక్క మహిళా కార్యకర్త ఉండడాన్ని వేలెత్తిచూపారు. 'భవిష్యత్‌లో శాసనసభ స్థానాల్లో కూడా 33 శాతం మహిళలకు రిజర్వు కాబోతున్నాయి. స్థానిక సంస్థల్లో 50 శాతం వారికి రాబోతున్నాయి. అందుకనుగుణంగా పార్టీలో మహిళా నాయకులను తయారుచేయాలి.

# చంద్ర గ్రహణం తొలగి ఆడబిడ్డలకు స్వేచ్ఛ.. వెలుగు

(మొదటి పేజీ తరువాయి)

దినోత్సవం సందర్భంగా మంత్రి సీతక్క అధ్యక్షతన సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో లక్షమంది మహిళలతో శనివారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సమావేశంలో ఆయన 'ఇందిరా మహిళా శక్తి మిషన్-2025' పాలసీని ఆవిష్కరించారు. 2,82,552 మహిళా సంఘాలకు రూ.22,794 కోట్ల చెక్కును అందజేశారు. మహిళలకు 31 పెట్రోల్ బంకులు, 128 సోలార్ ప్లాంట్స్ అందించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు లోన్ బీమా, ప్రమాద బీమా పథకాల కింద రూ.44.80 కోట్ల చెక్కును అందజేశారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో టీజీఎసఆర్టీసీలో నడిపే 20 బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా.. 'కోటి మందిని కోటీశ్వరులను చేద్దామా!?' అంటూ మహిళలతో నినాదాలు చేయించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. "ఐకేపీ కేంద్రాల నుంచి వడ్లు తీసుకుంటున్న కొందరు మిల్లర్లు పంది కొక్కుల్లా వాటిని కాజేస్తున్నారు. వాటిని తిరిగి ఇవ్వడం లేదు. లెక్కలూ చెప్పడం లేదు. ఆ దొంగలను వదలం. వారికి బుద్ధి చెబుతాం. అదే సమయంలో, రైస్ మిల్లులు, గోదాములు నిర్మించేలా మహిళా సంఘాలను ప్రోత్సహిస్తాం. ప్రభుత్వమే స్థలం ఇవ్వడంతోపాటు వాటి నిర్మాణాలకు అవసరమైన రుణాలూ ఇప్పిస్తుంది. తద్వారా దొంగలకు గుణపాఠం చెప్పినట్లు అవుతుంది. ఒక అన్నగా ఇది నా బాధ్యత" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు పౌష్టికాహారం మహిళా సంఘాల నుంచి సరఫరా చేయాలని నిర్ణయించామని చెబుతూ.. అందుకు ఓ విధానాన్ని రూపొందించే బాధ్యతను సీఎసకు, సెర్ప్ సీఈవోకు అప్పగించారు. "ఎస్ఎల్‌బీసీలో టన్నెల్ కూలి మనుషులు చనిపోతే బీఆర్ఎస్ నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారు. రోడ్డు ప్రమాదంలో ఎవరైనా చనిపోయినా.. కాలేజీ కూలినా.. పంట ఎండినా.. రేవంత్‌ను తిట్టవచ్చంటూ నన్ను తిట్టడంలో పైశాచిక ఆనందం పొందుతున్నారు. వాళ్లు ఎందుకంత పైశాచిక ఆనందం పొందుతున్నారు. పైశాచిక ఆనందంతో ఎవరూ బాగుపడిన దాఖలాల్లేవు. అది రాష్ట్రానికి మంచిది కాదు" అంటూ సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిందని, పదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఏడుపులు మాని.. రాష్ట్ర భవిష్యత్తుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "రాష్ట్రానికి పదేళ్లు చంద్ర గ్రహణం పట్టింది. మహిళా శక్తి ముందు చంద్ర గ్రహణం అంతరించిపోయింది. ఇవాళ రాష్ట్రంలో ఆడబిడ్డలు స్వేచ్ఛను, సమానత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని చూస్తున్నారు. చంద్ర గ్రహణం తొలగి.. ఇవాళ రాష్ట్రంలో అక్క చెల్లెమ్మలు వెలుగులు చూస్తున్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన చూశారు. అప్పట్లో మహిళల పట్ల పాలకులు వివక్ష చూపారు. ఆనాడు సీఎంగా ఉన్న చంద్రశేఖర్ రావు తన మొదటి ఐదేళ్లలో ఆడబిడ్డను మంత్రివర్గంలోకి కూడా తీసుకోలేదు. కమీషన్లకు కక్కుర్తి పడి విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించే పనిని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించారు. ఇప్పుడు మా 15 నెలల పాలన చూస్తున్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చాక మహిళా సంఘాలను ఏకీకృతం చేస్తున్నాం. ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాం. అందులో భాగంగానే ఆడబిడ్డలకు పాఠశాలల నిర్వహణ బాధ్యతలను అప్పగించాం.

## అతివలకు బీఎన్ఎస్ రక్షణ ఛత్రం..

(మొదటి పేజీ తరువాయి)

మహిళలకు రక్షణ కవచంగా మారిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని నవ్‌సారి జిల్లాలో ఉన్న వాంసి బోర్సి గ్రామంలో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల నేతృత్వంలో దేశం వేగవంతమైన పురోభివృద్ధి దిశగా దూసుకుపోతోందన్నారు. "మహిళలపై అత్యాచారాలు, అమానుషాలకు పాల్పడేవారికి ఉరిశిక్ష విధించేలా మా ప్రభుత్వం చట్టాలు తీసుకువచ్చింది. సత్వర న్యాయం జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశాం. దేశవ్యాప్తంగా మరో 800 కోర్టులను ఏర్పాటు చేయనున్నాం. బీఎన్ఎసలో మహిళలు, చిన్నారుల భద్రత కోసం ఒక ప్రత్యేక అధ్యాయాన్ని జోడించాం" అని ప్రధాని వివరించారు. బాధితులకు సత్వర న్యాయం అందని ద్రాక్ష అనే మాట గతంలో వినిపించేదని, కానీ, నూతన చట్టాల ద్వారా దారుణమైన కేసుల్లో విచారణను 60 రోజుల్లోనే పూర్తి చేయాలని, 45 రోజుల్లోనే తీర్పులు వెలువరించాలని స్పష్టంగా పేర్కొన్నట్టు తెలిపారు. కొత్త చట్టాల ద్వారా దేశంలో ఎక్కడైనా 'ఈ-ఎఫఐఆర్' నమోదు చేసే సౌలభ్యం అందుబాటులోకి వచ్చిందని, లైంగిక వేధింపులు ఎదుర్కొనే మహిళలు.. జీరో ఎఫ్ఐఆర్‌లను ఎక్కడైనా నమోదు చేయొచ్చని తెలిపారు. అత్యాచార బాధితుల వాంగ్మూలాలను ఆడియో, వీడియో మాధ్యమాల్లో కూడా నమోదు చేయొచ్చని చెప్పారు.

## గుజరాత్ కాంగ్రెస్ లో బీజేపీ కోవర్టులు

(మొదటి పేజీ తరువాయి)

అధికారం మనదేనని చెప్పారు. రెండ్రోజుల గుజరాత్ పర్యటనలో చివరిరోజైన శనివారం అహ్మదాబాద్‌లో ఆయన పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. 'మనలో కొందరు నేతలు రహస్యంగా బీజేపీ కోసం పనిచేస్తున్నారు. వారెవరో మనం వడపోయాలి. లేకుంటే రాష్ట్ర ప్రజలు మనల్ని విశ్వసించరు' అని చెప్పారు. ప్రజలు బీజేపీ వలలో చిక్కుకున్నారని అన్నారు. గత 20-25 ఏళ్ల బీజేపీ విజన్ విఫలమైందని.. కాంగ్రెస్ తేలికగా కొత్త విజన్ అందించగలదని తెలిపారు. 'గుజరాత్‌లో కాంగ్రెసకు జిల్లా, బ్లాక్, ఇతర స్థాయుల్లో

## పరిష్కారానికి పదేళ్లలో బీఆర్ఎస్ ప్రయత్నించలేదు

(మొదటి పేజీ తరువాయి)

ఉందని పేర్కొన్నారు. శనివారం డిప్యూటీ సీఎం అధ్యక్షతన ప్రజా భవన్‌లో ఎంపీల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కావాల్సి ఉండగా.. ఆయన రాలేకపోయారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కూడా హాజరు కాలేదు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు కూడా హాజరు కాలేదు. ఎంపీల సమావేశం నిర్వహిస్తున్నట్లుగా తమకు చాలా తక్కువ సమయంలో చెప్పారని, తాము ముందస్తుగా నిర్ణయించిన కార్యక్రమాలకు హాజరు కావాల్సి ఉన్నందున సమావేశానికి రాలేకపోతున్నామంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. కాంగ్రెస్‌కు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతోపాటు ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఈ భేటీకి హాజరయ్యారు. సమావేశం అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సమస్యలు, ప్రాజెక్టుల గురించి పార్లమెంటులో అన్ని పార్టీల ఎంపీలూ ప్రస్తావించాలన్న ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని భట్టివిక్రమార్క తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం దీనిని ఏర్పాటు చేయలేదన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలమైనా.. కేంద్రం నుంచి, ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన బకాయిలు రావడం లేదని చె ప్పారు. రాష్ట్ర ఎంపీలంతా కలిస్తేనే వీటిని సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి ఏయే పథకాలకు నిధులడిగాం, ఏయే రాష్ట్రా లు ఎలాంటి ప్రయోజనాలు పొందుతున్నాయి, తెలంగాణ ఎందుకు పొందలేకపోతోందన్న వివరాలను ఎంపీలకు వివరించామని తెలిపారు. రెండు బుక్‌లెట్‌లలో మొత్తం 28 సమస్యలను పొందుపరిచి, ఎంపీలకు అందజేశామన్నారు. ప్రధానంగా రాష్ట్ర విభజన హామీలు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, రీజినల్ రింగ్ రోడ్డు, వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కు, నవోదయ స్కూళ్లు వంటి పలు సమస్యలకు ఇప్పటివరకు పరిష్కారం లభించలేదన్నారు. పార్లమెంటులో చేపట్టే ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌లో రాష్ట్ర అంశాలను మన ఎంపీలు ప్రస్తావించాలని కోరారు.

# మరింత కష్టపడాల్సి వస్తోంది

చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఢిల్లీలో శనివారం ఇండియా టుడే నిర్వహించిన కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. 'జగన్ వైసీపీ నాయకుడు. శాసనసభలో ప్రతిపక్ష హోదా ఉండాలంటే మొత్తం సభ సంఖ్యాబలంలో పదిశాతం ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. వాటిని కాదని ఆయనకు ప్రతిపక్ష హోదా ఇవ్వలేం' అని స్పష్టంచేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తనపైనే అక్రమంగా 23 కేసులు నమోదు చేశారని..

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీతోపాటు హత్యాయత్నం కేసులు సైతం పెట్టారని తెలిపారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎవరికీ నిరసన తెలిపేందుకు అవకాశం లేదని, తమ ఇంటికే తాళ్లు కట్టారని చెప్పారు. ఇప్పుడు జగన్ ఎక్కడికైనా స్వేచ్ఛగా వెళ్తున్నారని అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కంటే ఆయనకే అధిక భద్రత ఉందని చెప్పారు. 'వైసీపీ పాలనలో పెద్ద ఎత్తున మద్యం అక్రమాలు, విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీంకోర్టులో కేసునడుస్తోంది' అని గుర్తుచేశారు. తమిళనాట భాషా యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో.. కేంద్రం ఏ భాషనూ రాష్ట్రాలపై రుద్దదని స్పష్టం చేశారు. 'వాస్తవానికి నేను కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసినప్పుడు.. తెలుగుకు ప్రాధాన్యమివ్వాలని నొక్కిచెప్పారు. మూడు భాషలే కాదు.. మన పిల్లలు జర్మన్, జపనీస్ కూడా నేర్చుకోవాలి. భవిష్యత్‌లో మన వాళ్లకు అటువైపే ఉద్యోగాలు రానున్నాయి. భారత్ వ్యూహాత్మక పాత్ర పోషిస్తున్నందున.. బహుళ భాషలు నేర్వాలి. ఏ భాష నేర్చుకోవాలనుకుంటున్నారో ఎంచుకునే అవకాశాన్ని పిల్లలకే ఇవ్వాలి' అని తేల్చిచెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న ఆందోళనతో తాను ఏకీభవిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. జనాభాను నియంత్రించడం దక్షిణ రాష్ట్రాలకు ప్రతికూలం కాకూడదన్నారు. అయితే ప్రస్తుత నిష్పత్తులు కొనసాగుతాయని కేంద్రం తేల్చిచెప్పిందని గుర్తుచేశారు. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నందున దీనిని ప్రచారాస్త్రం చేశారని.. అందుచేత ఇందులోకి ఆంధ్రప్రదేశ్ చొరబడాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. నైపుణ్య గణన కంటే కుల గణన చాలా సులభమని లోకేశ్ అన్నారు. రాష్ట్రంలో నైపుణ్య గణనను సవాల్‌గా తీసుకుని పనిచేస్తున్నామని చెప్పారు. విశాఖలోనే డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని, ఆ విషయంలో మరో ఆలేచనే లేదన్నారు. వై2కే విప్లవంలో హైదరాబాద్, దేశం లబ్ధి పొందితే.. ఇప్పుడు ఏపీ వంతని చెప్పారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉన్నాయని.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ముందుకు వెళుతున్నామనితెలిపారు. యువగళం పాదయాత్ర ద్వారా చాలా నేర్చుకున్నానని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, కష్టాలను స్వయంగా తెలుసుకుని పరిపూర్ణత సాధించానని తెలిపారు. ఎంబీఏ చదవడం బిజినెసకు మంచిదని, రాజకీయాలకు మాత్రం పాదయాత్ర ముఖ్యమని, అది రాజకీయాల్లో ఎంబీయే వంటిదన్నారు. 'ప్రజలతో మమేకం కావడం, సమస్యలను దగ్గరగా చూడడం, లోతుగా అర్థం చేసుకోవడం వంటివన్నీ దానిద్వారానే నేర్చుకున్నాను. వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే ఆలోచన పాదయాత్రలోనే వచ్చింది. ఈ నెలాఖరు నాటికి 350 సేవలను మనమిత్ర ద్వారా అందిస్తాం. ఇది ప్రారంభం మాత్రమే. భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తాం. ఆంధ్రప్రదేశ్ ఐటీ నుంచి ఏఐకి మారుతోంది' అని తెలిపారు.

# క్యాబినెట్ ఆమోదానికి రంగం సిద్ధమవుతోంది

హైదరాబాద్, రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తరభాగం పనులకు త్వరలో ప్రధాని మోదీ భూమిపూజ చేయనున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ రోడ్డును కేంద్రం సూత్రప్రాయంగా మంజూరు చేసిందని, క్యాబినెట్ ఆమోదానికి రంగం సిద్ధమవుతోందని చెప్పారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ) ఏర్పాటు, క్యాబినెట్ ఆమోదం కోసం ప్రక్రియ ప్రారంభం, ఆర్థిక విభాగానికి సంబంధించి త్రైపాక్షిక ఒప్పందం అంశాలపై కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఇటీవలే కోరామని తెలిపారు. ఆయన వెంటనే స్పందించి అప్పటికప్పుడు ఆదేశాలిచ్చారని పేర్కొన్నారు. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనులకు రూ.18,750 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్లు వెల్లడించారు. ఆర్ఆర్ఆర్‌ను జాతీయ రహదారిగా గుర్తించాల్సిందిగా గడ్కరీని కోరినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.6,200 కోట్లతో చేపట్టిన 10 జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయిందని, వీటిని పార్లమెంటు సమావేశాల అనంతరం గడ్కరీ ప్రారంభిస్తారని చెప్పారు. ఆర్ఆర్ఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్లు డిపాజిట్ చేయాల్సి ఉండగా.. కేవలం రూ.100 కోట్లు మాత్రమే ఇచ్చి కేంద్రాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తోందని ఆరోపించారు. దీనిపై తాను ముఖ్యమంత్రికి లేఖ రాస్తే.. జవాబు రాలేదన్నారు. "తమ వద్ద అన్ని నిధుల్లేవని, ప్రస్తుతానికి వంద కోట్లు జమ చేస్తామని, భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమైన తరువాత పరిస్థితిని బట్టి మిగతా నిధులు జమ చేస్తామని ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి నాకు లేఖ రాశారు. సాధారణంగా అయితే వందశాతం నిధులు ఒక రాష్ట్ర ప్రభుత్వం డిపాజిట్ చేస్తేనే కేంద్రం ఆయా ప్రాజెక్టులను ప్రారంభిస్తుంది. కానీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని కేంద్ర మంత్రి గడ్కరీని తాను ఒప్పిస్తే ఆయన అంగీకరించారు. ఇదంతా జరిగింది రేవంత్ సీఎం అయిన కొత్తలో" అని కిషన్‌రెడ్డి వివరించారు.

# అసైన్డ్ భూమిపై ఆ 'షరతు'ను అధికారులే నిరూపించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి పరిస్థితుల్లో అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై ఉన్న నిషేధం ఆ భూములకు వర్తించదని పునరుద్ఘాటించింది. 18.6.1954కి ముందు అసైన్డ్ చేసిన భూముల విక్రయానికి సమర్పించే డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ అధికారులు స్వీకరించి తీరాల్సిందేనని, ఇందుకు సంబంధించి రావి సతీష్ కేసులో హైకోర్టు ధర్మాసనం గతంలో ఇచ్చిన తీర్పును రెవెన్యూ అధికారులందరూ పాటించాలని తేల్చి చెప్పింది. భూముల రిజిస్ట్రేషన్‌కు నిరభ్యంతర పత్రంను (ఎన్‌వోసీ) తప్పనిసరి చేయడానికి వీల్లేదని కూడా ధర్మాసనం అప్పట్లోనే స్పష్టం చేసిందని గుర్తు చేసింది. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరు గ్రామం సర్వే నంబరు 177/ఏలోని 0.66 సెంట్ల భూమిని ప్రభుత్వానిదిగా పేర్కొంటూ 2008లో పెనమలూరు తహసీల్దార్ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది. ఇందులోని 0.66 సెంట్ల భూమి రిజిస్ట్రేషన్‌ను నిరాకరించడాన్ని తప్పుబట్టింది.

సామాన్యుడి ఆయుధం
అస్త్రం
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
ప్రకాశం - బాపట్ల
ఆదివారం 9 -3-2025

# ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం




భూ యజమానులకు శాపం

ప్రైవేట్ స్థలంలో విద్యుత్ స్తంభాలు స్పందించని అధికారులు

కోర్టు ఆదేశాలు సైతం బేఖాతరు

న్యాయం చేయాలంటూ బాధితుల ఆవేదన



**కనిగిరి అస్త్రం ప్రతినిధి :** నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో భూ యజమానులకు తీవ్ర నష్టం కలుగుతుంది. దీనిపై బాధితులు అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదని దీంతో కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాలు జారీ చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తపరిచారు. కనిగిరి టౌన్ కొత్తూరు పరిధిలోగల మా గుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం దగ్గర పామగ్రు రోడ్డులో ఉన్న పాతక్క విద్యుత్ స్తంభాలు తొలగించి వాటి స్థానంలో కొత్తవి (పెద్దవి) విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారని, ఆర్ అండ్ బి శాఖ రోడ్డు మొత్తం కొలతలు వేయకుండా సర్వే చేయకుండా వారి ఇష్టం వచ్చినట్లు స్తంభాలు విద్యుత్ వైర్లు వేస్తున్నారని మడుతుల వెంకటరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డిలు ఆవేదన వ్యక్తపరిచారు. సుబ్బిరామిరెడ్డి బొమ్మ దగ్గర పామగ్రు రోడ్డులో తూర్పు వైపున 65 అడుగుల పైబడి ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందని, ఆ భూమిని వదిలేసి పడమర వైపు ఉన్న 60 అడుగుల ప్రైవేట్ స్థలంలో స్తంభాలు వేస్తున్నారన్నారు. పడమర వైపు ప్రభుత్వ స్థలం చాలా తక్కువగా ఉందని కొలతలు వేయకుండా ప్రైవేట్ భూమిలో స్తంభాలు వేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఆర్ అండ్ బి అధికారులు కావాలనే ప్రభుత్వ స్థలాన్ని విడిచిపెట్టి ప్రైవేట్ స్థలంలో స్తంభాలు వేస్తున్నారని, ప్రవర్త స్థలాల్లో కొలతలు వేయకుండా పడమర వైపు ఉన్న ప్రైవేట్ వ్యక్తుల స్థలంలో విద్యుత్ స్తంభాలు వైర్లు వేయాలని ప్రయత్నించగా ఆ స్థలంలో స్తంభాలు వైర్లు వేయవద్దని ఇల్లు కట్టుకుంటామని అధికారులకు తెలియపరచడం జరిగిందన్నారు. ఈ సమస్యపై అధికారులకు అర్జీ పెట్టిన ఏమాత్రం స్పందించలేదని, విద్యుత్ స్తంభాలు వేసే కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి తనకు ఇష్టం వచ్చినట్లు స్తంభాల వేస్తున్నారని, ఎలాంటి సర్వే లేకుండా ముందుకు ఒకటి వెనుకకు ఒకటి వేస్తున్నారన్నారు. సుబ్బిరామిరెడ్డి బొమ్మ దగ్గర రోడ్డుని మొత్తం కొలిచి అప్పుడు స్తంభాలు వేసినట్లయితే ప్రైవేట్ వ్యక్తులకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. అధికారులకు తమ సమస్యను వివరించిన పట్టించుకోవడంలేదని, ఈ సమస్యపై విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్లో సంప్రదించగా ఆర్ అండ్ బి అధికారులు చెప్పిన ప్రకారం స్తంభాలు వేస్తున్నామని, మీరు విలేకరుల ఆశ్రయించిన ఎవర్ని ఆశ్రయించిన ఏమీ జరగదని తమ పని తాము చేసుకో పోతామని చెప్పడం గమనార్హం. అయితే ఇదే సమస్యపై ఆర్ అండ్ బి ఏఈ కి (అధికారులకు) వివరాల తెలుసుకునేందుకు విలేకరులు మూడు మార్లు ఫోను చేసిన ఆయన స్పందించలేదు. సమస్యపై వివరాలు తెలుసుకునేందుకు విలేకరులు ఫోన్ చేసిన ఆర్ అండ్ బి అధికారులు స్పందించలేదంటే సామాన్యుల పరిస్థితి ఏంటని ఈ ప్రాంతీయులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించకుంటే తీవ్ర పరిమళాలు ఎదుర్కోక తప్పదనే వారు ఈ సందర్భంగా హెచ్చరించారు.



# ఏడాదిలో వసతి గృహాలకు సన్న బియ్యం పంపిణీ

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

కనిగిరిలో బీసీ గురుకుల బాలికల వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి

ఆర్వో ప్లాంట్ మంజూరుకు హామీ



**కనిగిరి అస్త్రం ప్రతినిధి :** ఏడాదిలో వసతి గృహాల అన్నింటికీ నాణ్యమైన సన్న బియ్యాన్ని అందిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. శనివారం కడప నుంచి కనిగిరి వైపు వెళుతూ కనిగిరిలోని బీసీ గురుకుల బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లోని విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిలబస్ పూర్తయిందా, తరగతుల వారి విద్యను ఎలా అందిస్తున్నారు, భోజనం అందుతుందా లేదా అని వివరంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వసతి గృహాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచి నిధులు మంజూరు చేయడం వంటివి జరుగుతున్నాయని , విద్య పట్ల విద్యార్థులు శ్రద్ధ కనపరిచి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశామన్నారు . అనంతరం వసతి గృహ పరిసరాలను పరిశీలించి అద్దె భవనమా లేక ప్రభుత్వ భవనమా అని అడగడం జరిగింది. క్యాంటీన్ ను పరిశీలించి అక్కడి భోజనాన్ని సైతం రుచి చూశారు. అనంతరం పరిసరాలను పరిశీలించి 200 మందికి పైగా విద్యార్థులు కలిగిన ఈ వసతి గృహంలో విద్యుత్ కాంతులు ఇలాగేనా ఉండేది అంటూ వార్డెన్ పై మండిపడ్డారు. స్టాక్ రూముకు నేరుగా వెళ్లి సరుకులను పరిశీలించి స్టాక్ రిజిస్టర్ అడుగగా అందుబాటులో లేదని వార్డెన్ చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాక్ రూమ్ లో రిజిస్టర్ లేకపోవడం వంటి లోపాలు తన తనిఖీలలో గుర్తించడం జరిగిందని సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మంచినీటి విషయమై విద్యార్థులు తన దృష్టికి తీసుకువచ్చారని త్వరలో ఆర్వో ప్లాంట్ మంజూరు చేయిస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారు.

# శ్రీ విద్యానికేతన్ లో ఘనంగా మహిళా దినోత్సవ సంబరాలు

**సింగరాయకొండ: అస్త్రం ప్రతినిధి :** మూలగుంట పాడులోని శ్రీ విద్యానికేతన్ హై స్కూల్ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయునిలకు ముగ్గులపోటీలు, రన్నింగ్ రేస్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సంధర్భంగా కరస్పాండెంట్ సైకం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముందుగా మహళలందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల పట్ల గౌరవం సమానత్వం, సాధికారతను సాధించడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. హైస్కూల్ హెడ్మాస్టర్ సైకం శ్రీవిద్య మాట్లాడుతూ మహిళలు స్వశక్తిపై ఆధారపడి సమాజంలో గౌరవనీయమైన స్థానానికి చేరుకోవాలని మహిళలు అన్ని రంగాలలో స్థానాలను అధిరోహించాలన్నారు.అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.




# నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలి

వార్షికోత్సవ వేడుకలలో డిఇఓ కిరణ్ కుమార్





యర్రగొండపాలెం అస్త్రం ప్రతినిధి : మండలంలోని జడ్ పి హెచ్ యస్ వీరభద్రాపురం పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు హెచ్ఎం మంత్రు నాయక్ అధ్యక్షతన ఉత్సాహవంతంగా నిర్వహించారు.డిఇఓ ఎ. కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఈ వున్న కొద్దిసమయం ఉపాధ్యాయులు చెప్పే సూచనలు పాటించాలని ఒక క్రమబద్ధమైన టైంటేబుల్ ఏర్పాటు చేసుకుని చదివితే మంచిఫలితాలు సాధించవచ్చున్నారు.విద్యార్థులయొక్క కృషి అంతా ఫలితాలలో వ్యక్తమవుతుందనిమంచిఫలితాలతో పాఠశాలకు , తల్లిదండ్రులకు , మండలానికి జిల్లా కు మంచిపేరు తీసుకుని రావాలని పిలుపునిచ్చారు.యం ఇ ఓఆంజనేయులుమాట్లాడుతూ సంవత్సరమంతా ఎంత చదివామన్నదికాదు ఎంత మంచి ఫలితాలు వచ్చియన్నది ముఖ్యమనీ , చదవటం అందరూ చదువుతారు కానీ పరీక్షలు కొందరే బాగారాయగలుగుతారు .అదే ఫలితాలు వస్తాయన్నారు.మీకు మీరుగా ఒక ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని ,టీవీ లు , సెల్ ఫోన్లు , సినిమా లతో సమయాన్ని వృధా చేసుకోరాదని మంచి ఫలితాలతో బంగారు భవితకు బాటలు వేసుకోవాలన్నారు.మరో ముఖ్య అతిథి డిప్యూటీ డిఇఓ శామ్యూల్ జాన్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యా సాంస్కృతిక కార్యక్రమాలలో ఎంత ఉత్సాహంగా వున్నారో పరీక్షలు కూడా బాగా చదివి అంతే ఉత్సాహంగా రాయాలన్నారు. ఇప్పుడున్న కొద్ది సమయమైనా ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తే చక్కటి ఫలితాలు సాధించవచ్చున్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంత్రూ నాయక్ మాట్లాడుతూ మా పాఠశాలకు వచ్చి మా చిన్నారులను ఆశీర్వదించిన డిఇఓ కిరణ్ కుమార్ కి ,డివైఇఓ శామ్యూల్ జాన్ కి , యంఇఓలు ఆంజనేయులు కి , మస్తాన్ నాయక్ కి , మల్లూ నాయక్ కి , రాజశేఖర్ రెడ్డి కి ,ప్రధానోపాధ్యాయులు హేమ్లానాయక్ కి, బాలూ నాయక్ కి , ఎపిజీబి మేనేజర్ రంజం నాయక్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంత్రూనాయక్ మాట్లాడుతూ సంవత్సరమంతా ఎన్నో అల్లర్లు , తమాషాగా సాగినప్పటికీ పరీక్షలు రాయాల్సిందేననీ , ఆఫలితాలే మీ భవిష్యత్తుకు బాటలు వేస్తాయనీ , మంచి ఫలితాల కోసం ఈ వున్న కొద్దికాలం ఉపయోగించుకోవాలనీ ,ఉపాధ్యాయుల సూచనలు పాటించాలనీ తెలిపారు.వివిధ మండల విద్యాధికారులు , పాఠశాలసిబ్బంది హాజరై విద్యార్థులు మంచిఫలితాలతో మంచి భవిష్యత్తు కు బాటలు ఏర్పాటు చేసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు , వేషధారణలు , నాటికలు చాలా సందేశాత్మకంగా , ఉత్సహవంతంగా ప్రదర్శించి చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులలో ప్రత్యేకతలు గుర్తించి వారికి తగు తర్ఫీదు నిచ్చి సాంస్కృతిక కార్యక్రమాలు రూపొందించిన ఉపాధ్యాయులు నాగేశ్వరరావు నాయక్, శ్రీదేవి , లక్ష్మీ దేవి , సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణ మూర్తి నాయక్ దేవ ప్రసాద్ పోతురాజుపాఠశాలల సిబ్బంది , ఉపాధ్యాయులు విద్యార్థులపై చూపిన శ్రద్ధ , ప్రేమానురాగాలు , సహకారం మరిచిపోలేనిదని ప్రధానోపాధ్యాయులు సిబ్బందిపై ప్రశంసల జల్లు కురిపించారు.

# మహా ధర్నా కరపత్రాలు ఆవిష్కరణ

12న విజయవాడలో నిర్వహించే మహా ధర్నాను జయప్రదం చేయాలి



**చంద్రశేఖరపురం అస్త్రం ప్రతినిధి :** వ్యవసాయ కార్మికుల డిమాండ్ల సాధనకై ఈ నెల 12 న నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు కోరారు. మహాధర్నా పాంప్లెట్ ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఉపాధి హామీ, వ్యవసాయ కార్మికుల డిమాండ్లు సాధన కోసం ఈనెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ లోని ధర్నా చౌక్ లో ఈ మహా ధర్నా కార్యక్రమం చేపడుతున్నాడు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఊస రాజ్యలక్ష్మి, ఎస్ తిరుపతి రెడ్డి, గుర్రం లక్ష్మయ్య, డోల తిరుపతయ్య, బి ఏసురత్నం పాల్గొన్నారు.

4
సామాన్యుడి ఆయుధం
ప్రజల అస్త్రం
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
ప్రకాశం - బాపట్ల
ఆదివారం 9 -3-2025



## ఘనంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవం

### పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు



**చంద్రశేఖరపురం అస్త్రం ప్రతినిధి:** చంద్రశేఖరపురం మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో విశ్రాంత స్పెషల్ కలెక్టర్ పిడుగు బాబురావు ఆధ్వర్యంలో నూతనముగా నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి గరుడ విమాన కలశ జీవద్వజ రాజగోపుర ప్రతిష్ట మహోత్సవ వేడుకలు ఘనముగా నిర్వహించారు.ఆలయ ప్రతిష్ట మహోత్సవానికి గన్నవరం మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వర్లు డిప్యూటీ రిటైర్డ్ కలెక్టర్ ప్రభాకర్ రావు. రిటైర్డ్ కలెక్టర్ నాగబాబు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాదవితరణ చేశారు తదుపరి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహమూర్తులను గ్రామోత్సవము నిర్వహించారు గ్రామోత్సవంలో భాగముగా తిరుపతి ఇస్కాన్ రూపేష్ ప్రభూజి బృందం వారిచే నగర సంకీర్తనలుస్వామివారి ప్రవచనములు నిర్వహించారు పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ పిడుగు బాబురావు విజయ దంపతులు కుమారుడు సాయి అభినయ్ భార్గవి దంపతులు గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

### అరివేములలో మహిళల ర్యాలీ

### మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

### కంపిటేటివ్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న ముత్యాల నరేష్ రెడ్డి




**చంద్రశేఖరపురం అస్త్రం ప్రతినిధి :** మహిళలు అన్ని రంగాలలో రాణించాలని అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆనందం నవబడి చారిటబుల్ ట్రస్ట్ సీఈఓ ఆల్బర్ట్ మ్యాథ్యూస్ అన్నారు. ఆనందం నవమణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అరివేములలో మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు తదుపరి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాధా రుక్మిణమ్మ, షేక్ గౌసియా, నాగేశ్వరి, ఇమ్మానుయేలు, సంగటి ఏబు, సుధాకర్ పాల్గొన్నారు. మండలంలోని సిఎస్పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శీలంవారిపల్లి కదిరి వెంకటనరసయ్య లక్షమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసిఆర్ పిఎఫ్ ప్రకాశం జిల్లా హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ అడ్వైజర్ ముత్యాల నరేష్ రెడ్డి విద్యార్థులకు ఓం శ్రీ పరాశక్తి తల్లి ట్యూషన్ పాయింట్ మరియు కంపిటేటివ్ కోచింగ్ సెంటర్ కరపత్రాలను పంపిణీ చేశారు.



# జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి




సంతనూతలపాడు అస్త్రం ప్రతినిధి: ఈనెల 14న పిఠాపురంలో జరిగే రాష్ట్రస్థాయి జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను జయప్రదం చేయాలని బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్, పిఠాపురం సభ కమిటీ సభ్యులు వి. మార్కండేయులు, జనసేన పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు అలియాస్ బాబు తన తన ప్రసంగాల్లో కోరారు.సంతనూతలపాడు మండలం పెర్ణమిట్ట లొ శనివారం సాయంత్రం జరిగిన నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ సన్నాహక సమావేశానికి జనసేన పార్టీ నేత మార్కండేయులు ముఖ్యఅతిథిగా విచ్చేసి అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సంత నూతలపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరు వెంకటేశ్వరరావు అలియాస్ బాబు అధ్యక్షత వహించారు. సంతనూతలపాడు నియోజకవర్గ నుండి అత్యధికంగా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పిఠాపురం ఆవిర్భావ సభకు తరలి రావాలని మార్కండేయులు పిలుపునిచ్చారు. రాష్టంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఒకపక్క జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షు లు పవన్ కళ్యాణ్, మరొక ప్రక్క జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు, ఎంతగానో కృషి చేశారని మార్కండేయులు పేర్కొన్నారు. రాష్ట్రంలో జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఆయన కోరారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో గతంలోఎన్నడూ లేని విధంగా టిడిపి కూటమి అభ్యర్థి ప్రస్తుత ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్ కు అత్యధికంగా 30000 కి పైగా మెజార్టీ రావడానికి జనసేన పార్టీ నియోజకవర్గంలో ప్రధాన కారణం అని నియోజవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి బాబు తన ప్రసంగల్లో పేర్కొన్నారు. అదేవిధంగా కూటమి ఎమ్మెల్యే విజయ్ కుమార్ నియోజవర్గంలో జనసేన పార్టీకి అండగా ఎంతగానో ఉన్నారని కందుకూరు బాబు పేర్కొన్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి, జనసేన పార్టీ రాష్ట్ర నేత పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం 15 సంవత్సరాలు పాటు అధికారంలో ఉంటుందని చెప్పారని మనమందరం కూడా ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో జనసేన పార్టీని బలోపేతం చేసి రాబోయే రోజుల్లో పవన్ కళ్యాణ్ ని ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని కందుకూరు బాబు తన ప్రసంగాల్లో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పిఠాపురం ఆవిర్భావ సభ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 38, 42 డివిజన్ కార్పొరేటర్లు మలగా రమేష్,నూకతోటి మస్తానమ్మ, ఈశ్వరరావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి పి కోటేశ్వరరావు, ఒంగోలు పట్టణ జనసేన కార్యదర్శి కందుకూరి వాసు, సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు, చీమకుర్తి పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు ఏం. ఫణేంద్ర, పి శివప్రసాద్, ఎన్. బాలసుబ్రమణ్యం బి మురళి, టి. శ్రీరామ్, జనసేన పార్టీ నేతలు పి శ్రీనివాస్ పవన్, శివ కృష్ణ, తిరుమల శెట్టి రాము, కే ఆంజనేయులు, ఆకులు శీను మేకల పూర్ణచంద్ర రావు, ఏ నారాయణ, కాసిం, వి హరిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో నేటి వరకు సమావేశాలు నిర్వహించకపోవడం మరింత దారుణమని సమావేశంలో పలువురు జనసేన పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కమిటీ జనసేన పార్టీ మండలాల నాయకులకు తగుమేరకు అండగా నిలవటం లేదని జనసేన పార్టీ నాయకులు ఈ సందర్భంగా ఆరోపించారు.

# పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే ఉగ్ర





**చంద్రశేఖరపురం అస్త్రం మార్చి 8:** చంద్రశేఖరపురం మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ పిడుగు బాబురావు ఆధ్వర్యంలో నూతనముగా నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ట వేడుకల పూజా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఎంఎల్ఏ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి లకు పిడుగు బాబురావు కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు మేళ తాళాలతో స్వా గతం పలికారు అర్చకులు మంత్రి రామ్ నారాయణ రెడ్డి మరియు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం పిడుగు బాబురావు కుటుంబ సభ్యులు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మరియు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహా రెడ్డిని శాలువాలతో సత్కరించి శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వాకా సత్యనారాయణ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఘనంగా స్వాగతం పలికిన ముక్కు

**మార్కాపురం అస్త్రం ప్రతినిధి:** మార్కాపురంలో అంతర్జాతీయ మహిళ జాతీయ దినోత్సవం సందర్భంగా విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని ఎమ్మెల్యే %ణతీ% ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# మహిళల భవిష్యత్తు అభివృద్ధికి తగిన సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు సహాయాన్ని అందిస్తా - శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

### తెలుగు మహిళ, టైలరింగ్ శిక్షణ మహిళల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

కనిగిరి : అస్త్రం న్యూస్ పట్టణంలోని అమరావతి గ్రౌండ్ నందు మహిళా దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి.శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రత్యేకంగా హాజరయ్యారు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, సీనియర్ తెలుగు మహిళలనుసన్మానించారు. మహిళ సాధికారత, స్వావలంబన దిశగా ప్రభుత్వ కార్యక్రమాలపై ఎమ్మెల్యే గారు ప్రాముఖ్యతను తెలియజేశారు. మహిళల భవిష్యత్తు అభివృద్ధికి తగిన సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు సహాయాన్ని అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు, టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.






## మహిళల ఆర్థిక స్వావలంబనకు

# ఎన్డీఏ ప్రభుత్వం అడుగులు వేస్తోంది

**ఏడాదిలో లక్షమంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేస్తాం**

**వ్యాపారాల్లో రాణించేందుకు 24 సంస్థలతోఒప్పందాలు.**

**మహిళలు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తాం**

**ఆడబిడ్డలకు పెట్టుబడిలో 45% రాయితీలిస్తాం...మహిళల గౌరవాన్ని మరింత పెంచుతాం**

**మహిళల రక్షణ కోసం శక్తి యాప్ తెచ్చాం**

**ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం అమలు**

**ఇకపై ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికాన్పులైనా ప్రసూతి సెలవులు**

**అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**మార్కాపురంలో మహిళలతో సీఎం ముఖాముఖి**

మార్కాపురం, అస్త్రం ప్రతినిధి: ఏడాదిలో లక్షమంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని, పెట్టుబడుల్లో ఆడబిడ్డలకు 45 శాతం రాయితీలు కల్పిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఎవరైనా ఆడబిడ్డల జోలికొస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని, మహిళల రక్షణ కోసమే శక్తి యాప్ తీసుకొచ్చామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా మార్కాపురంలో మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ముందుగా నా ఆడబిడ్డలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. 25 ఏళ్ల క్రితం నేను డ్వాక్రా, మెప్మా వ్యవస్థలను ప్రారంభించాను. ఈ రెండూ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని నిలబడ్డాయి. ఈఏడాది డ్వాక్రా, మెప్మా సంఘాలు బ్యాంకుల నుంచి రూ. 35 వేల కోట్ల రుణాలు తీసుకున్నాయి. ఓ ఎన్ డి సి ప్లాట్ ఫాం మీద 4 గిన్నీస్ అవార్డులు వచ్చాయి. 10 రోజుల్లో రూ. 5 కోట్ల టర్నోవర్ చేశారు. అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. సరైన ఫ్లాట్ ఫామ్ చూసుకుని మీరు తయారుచేసే వస్తువులను అమ్మగలిగితే మంచి లాభాలు ఆర్జించవచ్చు. టెక్నాలజీ సాయంతో అద్భుతాలు సృష్టించవచ్చు. ఇక్కడ సెల్ ఫోన్లు లేని ఆడబిడ్డలు లేరు. మహిళలు స్ఫూర్తి ప్రదాతలు . మొదట్లో నా భార్యకు వ్యాపారం చేయడం తెలీదు. పైగా ఆవిడ ఎన్టీఆర్ కుమార్తె కావడంతో తనకు ఆ అవసరం కూడా రాలేదు. నేను 1994లో కుటుంబం కోసం చిన్న బిజినెస్ మొదలుపెట్టాను. రాజకీయాల్లో బిజీ అవుతుండటంతో నా భార్యను వ్యాపారం చూసుకోమంటే తను మొదట్లో తిరస్కరించింది. తర్వాత ఒప్పుకుంది. సాధారణ మహిళ హెరిటేజ్ వ్యవహారాలు చూసుకుంటూ మరోవైపు లోకేష్ ను చదివించింది. అక్కడితో ఆగలేదు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. నేను ఆమె అంతలా అవుతుందని నేను ఊహించలేదు. నా అవసరాలకు డబ్బు ఇచ్చే స్థాయికి ఎదిగిన నా భార్య భువనేశ్వరిని ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. మాది వ్యవసాయ కుటుంబం. మా తల్లి కుటుంబం కోసం ఎంతో కష్టపడింది. చంద్రగిరిలో చదువుకోసం నేను 6 కిలోమీటర్లు నడిచి వెళ్లేవాణ్ణి. తెల్లవారుజామునే లేచి వంట చేసేది. ఉదయం ఆరున్నరకల్లా ఆమె మాకు క్యారేజీ కట్టేసేది. బయట పొయ్యిమీద వంట చేయడంతో ఆ పొగకు తల్లి ఇబ్బంది పడటం, ఆమె కంట కన్నీళ్లు రావడం నాకు ఇంకా గుర్తే. నా తల్లి పడిన కష్టం ఏ తల్లీ పడకూడదని దీపం పథకం తెచ్చాను. ఉచితంగా వంట గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. దేశంలో ఎవరికీ ఈ ఆలోచన రాలేదు. దీపం 2 కింద మళ్లీ మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాను. ఆడబిడ్డలంటే బలహీనులు అనే అభిప్రాయం మన సమాజంలో ఉంది. అంతెందుకు పొలంలో కూలి పనులకు వెళ్లినప్పుడు ఆడవారికంటే మగవాళ్లకే ఎక్కువ డబ్బులిస్తారు. ఒకప్పుడు ఆడవాళ్లు సైకిల్ తొక్కలేరని ఇచ్చేవారు కూడా కాదు. మహిళలు తమ శక్తి చూపించాలని, చదువు కొనసాగించాలని 8,9,10 చదివే ఆడపిల్లలకు ఉచితంగా సైకిళ్లు ఇచ్చాం. దాని వల్ల వారు చదువుకున్నాను. ఎవరైనా సరే ఆడబిడ్డల జోలికొస్తే అదే వారికి చివరి రోజవుతుంది. డ్వాక్రా ఏర్పాటుతో మహిళల జీవితంలో వెలుగులు తీసుకొచ్చినందుకు, వారి ఆర్థిక ప్రగతికి బాటలు వేసినందుకు నాకు సంతోషంగా ఉంది. సమాజంలో 50 శాతం ఉండే పురుషులు మాత్రమే పనిచేస్తే అభివృద్ధి అసాధ్యం. అలాగే వారు సంపాదించి మీరు ఇంట్లో కూర్చుంటే చులకనగా చూస్తారు. సమాజం పైకి రావాలన్న, మహిళల గౌరవం పెరగాలన్నా ఒక వేదిక ఉండాలనిపించింది. అదే డ్వాక్రా . అప్పట్లో కొందరు మహిళలు తన భర్త కొడుతున్నాడు, అత్తమామలు వేధిస్తున్నారని నా దగ్గర బాధపడేవారు. వారిని ఎలా డీల్ చేయాలో నేను చిట్కాలు చెబుతూ ఉండేవాణ్ణి. నేడు డ్వాక్రా మహిళల ఆదాయంపైనే కుటుంబం ఆధారపడే పరిస్థితి వచ్చింది. మహిళలను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్తా. గత ఐదేళ్లు ఏం జరిగింది. మిమ్మల్ని బలవంతంగా బస్సుల్లో సభలకు తరలించారు. మధ్యలో వెళ్లిపోకుండా చుట్టూ గుంటలు తవ్వారు. ఇంత స్వేచ్ఛగా మీరు గడిచిన ఐదేళ్లలో మాట్లాడారా చెప్పండి. మీ శక్తి మేరకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తానని హామీ ఇస్తున్నాను. ప్రపంచంలో పనివేళల్లో మార్పులు వచ్చాయి. ఏ పని కావాలన్నా రోజుకింత, గంటకింత అన్నట్టుగా ఉంది. కరోనా తర్వాత ఇంటి నుంచి పనిచేయడం అలవాటయింది. గ్రామాల నుంచే పనిచేసే విధానానికి కంపెనీలు శ్రీకారం చుట్టారు. ఇళ్లలో ఉండే ఆడవారు ఖాళీ సమయాల్లో పనిచేయడం ద్వారా డబ్బులు సంపాదించుకునే అవకాశం కల్పించడం కోసం వర్క్ ఫ్రమ్ హోమ్ కు శ్రీకారం చుట్టాం. గ్రామాల్లో కూడా వర్క్ స్టేషన్లు కూడా పెడతాం. అక్కడ కూడా పనిచేసుకోవచ్చు. నెలలో ఒక పది రోజులు దగ్గరలోని పట్టణాలకు వెళ్లి ఉపాధి శిక్షణ పొందేలా ఏర్పాట్లు చేస్తాం. కంపెనీలు తీసుకొచ్చే బాధ్యత నాది. ఫిజికల్ గా వెళ్లి పనిచేయాలంటే ఖర్చవుతుంది. అదే మన ఊరిలో పనిచేస్తే ఖర్చు తగ్గుతుంది. వర్క్ ఫ్రమ్ హోం వల్ల తల్లిదండ్రులను చూసుకుంటూ వ్యవసాయం కూడా చేసుకోవచ్చు.జనాభా తగ్గుదల ఆందోళన కలిగించే అంశం. ఐటీలో పనిచేసే భార్యాభర్తలు నో కిడ్స్ ఓన్లీ ఎంజాయ్ అంటున్నారు. చైనాలో జనాభా తగ్గిపోతోంది. జపాన్ లోనూ అదే పరిస్థితి. యూరప్ లోనూ తగ్గుతున్నారు. అక్కడ వృద్ధులు ఎక్కువయ్యారు. వారి సంపాదన అనుభవించేందుకు కనీసం వారసులు కూడా లేరు. మన దేశంలో ప్రస్తుతానికి జనాభా బాగానే ఉన్నప్పటికీ 20 ఏళ్ల తర్వాత ఇంకా తగ్గుతుంది. నార్త్ లో జనాభా బాగుంది. మన సౌత్ లో ఒక్కరినే కని సరిపెడుతున్నారు. ఒక్కరినే కనమని ఒకప్పుడు నేను పిలుపునిచ్చాను. కానీ నేడు ఇద్దరు, ముగ్గురిని కనమంటున్నాను. దేశ, సమాజ మనుగడ కోసమే ఇలా చెప్తున్నాను. ఒకప్పుడు ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అర్హత లేదని చట్టం చేశాం. ఇప్పుడు ఇద్దరు పిల్లల కంటే తక్కువ ఉంటే పోటీకి అనర్హులు అని చట్టం తేవాలి. అందుకే తల్లికి వందనం తెచ్చాం. ఇంట్లో ఎందరు పిల్లలుంటే అందరికీ రూ. 15 వేలు ఇస్తాము. ఇప్పటివరకూ ప్రభుత్వ ఉద్యోగులకు ఇద్దరి వరకే ప్రసూతి సెలవులు ఉండేవి. ఇకపై ఐదారుమందిని కన్నా కూడా ఆరునెలలు ప్రసూతి సెలవులు, ఇతర ప్రయోజనాలు ఇస్తాము. మహిళలు లేకపోతే సృష్టి లేదు. మిమ్మల్ని కోరేది ఒకటే. 2047 నాటికి ప్రపంచంలో భారత్ అగ్రదేశంగా తయారవుతుంది. ప్రతి ఏడాది తలసరి ఆదాయం కూడా పెరుగుతుంది. నేనేమీ ఆకాశంలో అరుంధతి నక్షత్రం చూపించడం లేదు. జరిగేపనులే చెప్తున్నాను. సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమే. ఏ వ్యక్తీ పుట్టుకతోనే గొప్పవాడు కాలేదు. నేను చదువుకునే రోజుల్లో ఎమ్మెల్యేని కావాలనుకున్నాను. కష్టపడ్డాను. రెండేళ్లలో మంత్రినయ్యాను. ఎన్టీఆర్ గారిని కలవడం నా జీవితంలో మలుపు. ఆయన కుమార్తెతో పెళ్లి జరిగింది. రతన్ టాటా అంచెలంచెలుగా ఎదిగి తన కంపెనీని ఏస్థాయికి తీసుకెళ్లారో మనం చూశాం. రెడ్డీస్ ల్యాబ్ అంజిరెడ్డి, అపోలో ప్రతాప్ రెడ్డి ఇలా ఎందరో స్ఫూర్తి ప్రదాతలు ఉన్నారు. రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్స్ తెస్తున్నాం. ఏఐని ప్రోత్సహిస్తున్నాం. పెట్టుబడుల్లో మహిళలకు 45 శాతం రాయితీలిస్తాం. ఇంట్లో కూర్చునే డిగ్రీలు చేసే అవకాశం కల్పిస్తాం. పెళ్లి తర్వాత కూడా నాలుగైదు డిగ్రీలు చేసిన ఆడపిల్లలను చూశాను. వాట్సాప్ గవర్నెర్స్ తెచ్చాను. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందే వెసులుబాటు కల్పించాము. ఒకప్పుడు నేను సెల్ ఫోన్ అంటే అందరూ నన్ను ఎగతాళి చేశారు. నేడు సెల్ ఫోన్ లేనివారు ఎక్కడా కనిపించరు. సెల్ ఫోన్ నిత్యావసర వస్తువయ్యింది. అయితే ఫోన్ ను సద్వినియోగం చేసుకోవాలి. యూట్యూబ్ లు చూస్తే చెడు అలవాట్లు వస్తాయి. నాలెడ్జ్ ఎకానమీలో టెక్నాలజీ భాగమైంది. ఒకప్పుడు వ్యవసాయంలో తెగుళ్లు వస్తే పురుగులమందు కొట్టేవాళ్లం. కానీ నేడు డ్రోన్ ద్వారా ఎక్కడ తెగులు ఉంటే అక్కడే మందు కొడుతున్నాం. ఒకప్పుడు పంజాబ్ రాష్ట్రంలో వరి, గోధుమలు పండించేవారు. ఎరువులు ఎక్కువ వేసి పండించడంతో అక్కడి ప్రజలు కేన్సర్ బారిన పడ్డారు. పంజాబ్ నుంచి కేన్సర్ రోగులతో ప్రతి రోజు ఒక రైలు ఢిల్లీకి వస్తుందంటే పరిస్థితి ఎంత ప్రమాదంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అందుకే మనం తినే తిండిపై శ్రద్ధ పెట్టాలి. భువనేశ్వరిని చూస్తే నాకు గర్వంగా అనిపిస్తుంది. హెరిటేజ్ ద్వారా ఎందరికో ఉద్యోగ, ఉపాధి కల్పిస్తున్నారు. అలాగే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఆవిడ దగ్గర సేవలు పొందే వారే మార్కులు వేస్తారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేశానని, జాతికి అంకితం చేశానని గత ముఖ్యమంత్రి చెప్పాడు కదమ్మా. 1996లో వెలిగొండ ప్రాజెక్టు కు ఫౌండేషన్ నేనే వేశా. వాళ్లలా డ్రామాల నీళ్లు కాదు... ప్రాజెక్టు పూర్తిచేసి అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతానికి నీరు అందిస్తాను. నీరు ఒక భద్రత. గోదావరిలో మిగులు జలాలు సముద్రంలోకి పోతున్నాయి. పోలవరం-బనకచర్ల అనుసంధానంతో రాష్ట్రంలో కరువు లేకుండా చేస్తాను. గోదావరి నీరు వెలిగొండ ద్వారా మీకు ఇస్తాను. కృష్ణా నీరు కూడా అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాను. ప్రాజెక్టు కోసం భూములు పోగొట్టుకున్న వారినీ ఆదుకుంటాను. ప్రజలను మభ్య పెట్టడం, మోసం చేయడం కరెక్ట్ కాదు. అలగే... ఏది వాస్తవం, ఏది అవాస్తవమో ప్రజలు కూడా అర్థం చేసుకోవాలి. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక బూతులు కంట్రోల్ చేశాము. టీవీల్లో, అసెంబ్లీల్లో, సోషల్ మీడియాలో బూతులు లేవు. ఎవరైనా బూతులు మాట్లాడితే చట్టపరంగా చర్యలు తప్పవు. సమాజంలో సభ్యత ఉండాలి. మన పిల్లలకు సంస్కారం నేర్పించాలి. బూతులు తిట్టుకుంటే భావితరాలు నాశనమవుతాయి. గత ఐదేళ్లలో గంజాయి రాష్ట్రంలో ఒక పంట అయిపోయింది. ఎక్కడికక్కడ గంజాయి తయారుచేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. గంజాయి , డ్రగ్స్ కి ఎందరో బానిసలయ్యారు. ఈగల్ వ్యవస్థ ద్వారా గంజాయిని అరికట్టగలుగుతున్నాం. డ్రోన్ ల ద్వారా గంజాయి పంట పండించే ప్రాంతాలను గుర్తించి కట్టడి చేస్తున్నాం. ఎవరైనా ఆడబిడ్డల జోలికొస్తే అదే వారికి చివరిరోజు. ఆడబిడ్డల రక్షణ కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శక్తి యాప్ తీసుకొచ్చాం. మీరు ఒక్క మెసేజ్ ఇస్తే 7 నిమిషాల్లో పోలీసులు వచ్చేస్తారు. నేను నిద్రలేచినప్పటి నుంచి పడుకునే వరకూ పనిచేస్తాను. యువత కంటే ఎక్కువ దూరదృష్టితో ఆలోచిస్తాను. నేను చేసే పనులతో తెలుగుజాతి బాగుపడాలి అని తపిస్తాను. మంచి పేరు తెచ్చుకోవాలన్నది నా స్వార్థం. మన ఆలోచనలు సరిగా ఉంటే ఆరోగ్యం కూడా సరిగా ఉంటుంది. తప్పుడు ఆలోచనలు ఉంటే తప్పుడు పనులు చేస్తారు. దీని వల్ల టెన్షన్ వస్తుంది. నేను పడుకున్న రెండు నిమిషాల్లో నిద్రపోతాను. అలారం మోగేదాకా నిద్రలేవను. నన్ను అరెస్ట్ చేసినప్పుడు 53 రోజులూ 70 దేశాల్లో తెలుగువారు శాంతియుతంగా నిరసన తెలిపారు. వారు చూపిన అభిమానాన్ని నా జీవితంలో మర్చిపోలేను. ఇక ఆరోగ్యం విషయానికి వస్తే నాలుకను కంట్రోల్ చేసుకోకపోతే రోజూ ఆస్పత్రికి వెళ్లాల్సిందే. మందులకు అలవాటైతే బాడీలో తేడాలు వస్తాయి. శరీరానికి కావాల్సింత మాత్రమే తినాలి. స్వీట్స్ తింటే బాగుంటుంది. కానీ షుగర్ వస్తుంది. మన ఆరోగ్యం మన చేతిలోనే ఉంటుంది. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. సమయానికి భోజనం చేయడం కూడా మన ఆరోగ్యాన్ని కాపాడుతుంది. నిద్ర, తిండి, ఆలోచన, పని ఇవి ముఖ్యం. రోజూ నడక అలవాటు చేసుకోవాలి. నేను ఒక రింగ్ పెట్టుకుంటాను. నా బాడీ ఎలా ఉంది, ఎలా నిద్ర పట్టింది, ఎనర్జీ ఉందా లేదా అన్నీ చెబుతుంది. నేను మంచినీళ్లు తాగుతుంటే కొందరు ఎగతాళి చేస్తారు. నా ఆరోగ్యం బాగోక ఇంట్లో రెండు రోజులు పడుకుంటే ఈ రాష్ట్రానికే నష్టం. నాకు ఆరోగ్యం సరిగాలేక సెలవులు తీసుకోవడం ఇంతవరకూ ఎవరూ చూసుండరు. మన తలసరి ఆదాయం రూ. 2 లక్షల 68 వేలు. దీన్ని 58 లక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రతి ఏడాది ప్రజల ఆదాయం 15 శాతం పెరిగితే అది సాధ్యమే. సంపద, ఆరోగ్యం, ఆనందం మన సిద్ధాంతాలు. నిజం చెప్పాలంటే మీతో మాట్లాడాక నా ఎనర్జీ డబుల్ పెరిగింది. తల్లీ.నీకు ఓటు హక్కు లేకపోయినా డిమాండ్ చేస్తున్నావు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే మార్కాపురాన్ని జిల్లా చేస్తాను. పీజీ సెంటర్ కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాను. గత పాలకులు వెళ్తూ వెళ్తూ రూ. 10 లక్షల కోట్లు అప్పు అప్పగించి పోయారు. ఆ అప్పు, వడ్డీ రెండూకట్టాలి. వడ్డీ కట్టాలి. ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి. మీ అందరికీ న్యాయం చేస్తాను. నేను అందరి సమస్యలు పరిష్కరిస్తాను. కొంచెం టైమ్ పడుతుంది. యువత ఆలోచన చేయాలి. రాష్ట్రంపై అప్పుల భారం ఉంది. సంపద పెంచాలి. అవతలివాళ్లలా నేను అబద్ధాలు చెబుతూ బుకాయించడం లేదు. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తాను. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో నిష్టాతులైన, సేవలు అందిస్తున్న మహిళలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు సన్మానించారు.













సామాన్యుడి ఆయుధం
అస్త్రం
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
6
విశాఖపట్నం | అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం 9 -3-2025

# రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుంది

## ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి .. 28 మంది లబ్ధిదారులకు సుమారు రూ.32లక్షల చెక్కులు



దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా వుంటేనే రాష్ట్రం ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా మారి త్వరగా అభివృద్ధి దిశలో పయనిస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మాడుగుల నియోజకవర్గ పరిధిలోని 28 మంది లబ్ధిదారులకు సుమారు 32 లక్షల చెక్కులను శనివారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ అనారోగ్యానికి గురై వైద్య చికిత్సలు చేయించుకున్న బాధితులను ఆదుకునేందుకు పేద ప్రజల వైద్య ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందజేస్తున్నారని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి తెలిపారు. మాడుగుల మండలం రూ.7,04,112, చీడికాడ మండలం రూ.7,00,780, దేవరాపల్లి మండలం రూ 10,07,533 K. కోటపాడు మండలం రూ.7,58,396, సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.31 లక్షల 70 వేల 832 విలువైన 28 చెక్కులను అందించారు. లబ్ధిదారులకు చెక్కులతో పాటు ముఖ్యమంత్రి సందేశ పత్రాలను కూడా ఏమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అందజేశారు. వైద్యం విషయంలో పేద ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిత్యం ఎంతో మంది పేదలకు వైద్యానికి అయిన ఖర్చుల్లో అత్యధిక భాగానికి అందజేస్తున్నారని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే సత్యనారాయణ మూర్తికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైవాడ ప్రాజెక్టు చైర్మన్ పోతల పాత్రు నాయుడు, మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శిలు చిటిమిరెడ్డి సూర్యనారాయణ,శరఖాన సూర్యనారాయణ, మండల ఉపాధ్యక్షులు కొమర బాబురావు, రెడ్డి బలరాం, పెద్దాడ వెంకటరమణ, సిరికి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**పాచిపెంట అస్త్రం ప్రతినిధి:** ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ, పెద్దగెడ్డ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో పాచిపెంట మండలంలోని గొట్టురు గ్రామ పంచాయితీ చాపరాయవలస గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మహిళా సాధికారత, మహిళా హక్కులు వారి అభ్యున్నతి కోసం ఎ విదంగా పనిచేయాలి, మహిళా రైతులు ఆర్థికం గా బలపడటం కోసం ఎఫ్ పి ఓ తో కలసి పనిచేయటం. విద్య, ఉద్యోగ, రాజకీయాలలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.స్త్రీ,పురుష సమానత్వం కోసం చర్చించటం జరిగింది. మహిళలు పీసా చట్టం గ్రామ సభలలో ఉత్సాహం గా పాల్గొని సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాలని తెలుపడం జరిగింది. అలాగే మహిళల, ఆడపిల్లల భద్రతకు ఎన్నో రక్షణ చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాలను ఈ సందర్భంగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ ఆఫీసర్. తిరుపతిరావు , వెటర్నరీ డాక్టర్ యం. వెంకటరమణ, ఎంపీటీసీలు కొండలరావు అంజలి చదల ఆర్ట్స్ సంస్థ సీఈవో ఎం.ఆర్.ఎన్ భట్లు, మన్య సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు పి. తమ్మయ్య, ప్రాజెక్టు కోఆర్డినేటర్, పెద్ద గడ్డ ఉత్పత్తిదారుల సీఈవో డి. చందు, ఎల్. సందీప్ కుమార్ ఆర్ట్స్ సిబ్బంది,గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం...




కొయ్యూరు అస్త్రం ప్రతినిధి : అల్లూరి జిల్లా కోయ్యూరు మండల పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కొయ్యూరు స్టేషన్ సిఐ పి.వెంకట రమణ,ఎస్ఐ కిషోర్ వర్మ మాట్లాడుతూ స్త్రీలు విద్య, ఉద్యోగాలు, వ్యాపారం రాజకీయ రంగాల్లో మహిళలు తమ ప్రతిభతో ఏ లక్ష్యమైన సాధించాలని అన్నారు విద్యార్థులను తమ కలలను సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని హక్కులు పొందేలా ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. విద్యార్థులు స్వీయ రక్షణకు సంబంధించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. బయట ప్రదేశాలలో మహిళలు ఆత్మధైర్యంతో ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలు



జీ.కే వీధి అస్త్రం ప్రతినిధి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మీదేవి జీ.కే విధి ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో ఘనంగా జీకే వీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ మాట్లాడుతూ 1911 లో ఆస్ట్రేలియా డెన్మార్క్ జర్మనీ సిరిజర్ లాంటి దేశాల్లో అంతర్జాతీయ దినోత్సవం నిర్వహించారని గుర్తు చేశారు. మొదటగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం శ్రామిక మహిళా దినోత్సవం గా పిలిచేవారని 1995 సంవత్సరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గా ఐక్యరాజ్యసమితి అధికారికంగా నిర్వహించడం జరిగిందన్నారు. స్త్రీ లేకపోతే జననం గమనం సృష్టిలో జీవం లేదని అసలు సృష్టి ఉండదని తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్యా వైద్యం వ్యాపార రాజకీయ క్రీడ నటన టెక్నాలజీ బ్యాంకింగ్ హెల్త్ కేర్ అంతరిక్షం మరియు ఇంటి బాధ్యతలతో సహా మహిళలే నేడు రాణిస్తున్నారని గుర్తు చేశారు. మహిళా సాధికారిక సాధన దిశగా అడుగులు వేస్తున్నారని మహిళల ఎన్ని రంగాల్లో ముందున్నారని ప్రశంసించారు. స్త్రీలు ఏ రంగం ఎంచుకున్న కష్టం ఎంతైనా ఉన్నత శిఖరాలను చేరుకునే విధంగా శ్రమించాలని తెలిపారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన అంగన్వాడీ కార్యకర్తలకు ఘనముగా దుస్సాల్వాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వలసమ్మ కె రామలక్ష్మి మోహిని డి కృష్ణకుమారి కిషోర్ బాలికలు అంగన్వాడి కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ముక్కలు చేయడమే కమ్యూనిస్టుల విధానం: ఆదివాసీ జెఎసి



జీ.కే.వీధి అస్త్రం ప్రతినిధి : ముక్కలు చేయడమే కమ్యూనిస్టుల విధానమని,ఆవిధంగానే ఆదివాసీ ఉద్యమాలను ముక్కలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఆంధ్ర ప్రదేశ్ ఆదివాసీ జెఏసి రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు.కమ్యూనిస్టుపార్టీని ముక్కలు చేసినట్లు ఆదివాసీ ఉద్యమాన్ని ముక్కలు చేయడానికి కమ్యూనిస్టులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని,గిరిజనేతరుడైన రొబ్బి శంకర్రావు ఆదివాసీ చట్టాలకు వ్యతిరేకంగా హైకోర్టు జడ్జికి వ్రాసిన లేఖకు వ్యతిరేకంగా ఆదివాసీ జెఏసి పాడేరు గిరిజన ఉద్యోగుల భవన్ వేదికగా 2019 డిసెంబర్ 16న రామరావుదొర కన్వీనర్ గా జిల్లా కమిటీ ఏర్పడింది.2021 జూన్ 14న పాడేరు శ్రీకృష్ణపురం హైస్కూల్ లో చెండా ఎలీయ రాష్ట్ర చైర్మన్ గా రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.6 నెలల కాలంలోపే చెండా ఏలియా రాజీనామా చేసారు.2023 ఏప్రిల్ 16వ తారీఖున డా.బాబురావు నాయుడు రాష్ట్ర చైర్మన్ గా ఎన్నికయ్యారు.ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేని రామారావుదొర ని జిల్లా కన్వీనర్ గా,చెండా ఎలీయా, బాబురావు నాయుడులను రాష్ట్ర చైర్మన్ లను ఎన్నుకోవడం ఆదివాసి జెఏసి చేసిన తప్పుగా కమ్యూనిస్టు పార్టీలు భావించడం ఎంత వరకు సమంజసమని, పెద్దన్న పాత్ర పోషించిలనే ఆలోచనలతో ఉన్న కమ్యూనిస్టు పార్టీ 1964,1967 లలో, ఆ తర్వాత ముక్కలు ముక్కలుగా విడగొట్టబడింది.ఆ విధంగానే ఆదివాసీ ఉద్యమాలను ముక్కలు చేయాలని ఉద్దేశంతో కమ్యూనిస్టుపార్టీలు ఉన్నాయి.కమ్యూనిస్ట్ లతో పాటు కొంతమంది ఆదివాసీ జెఏసిని ఉపయోగించికొని దందాలు చేద్దామనుకొన్న వారికి ఆ అవకాశం జెఏసి ఇవ్వలేదు,దాంతో వారు బయటకు వెళ్ళి ఆదివాసీ జెఏసిని విమర్శలు చేయడం వారి అవివేకానికి నిదర్శనం.దొంగలు దొంగ దొంగ అన్నట్లు ఉంది కోటి రూపాయల వసూలు,ఆదివాసీ ఆత్మ గౌరవ సభ జరిగే సమయంలో అందరూ కలిసే ఉన్నామని,చందాలు ఎంత వసూలు అయ్యాయో రివ్యూ మీటింగ్ లో చెప్పడం జరిగింది.కమ్యూనిస్ట్ పార్టీలు జాతీయ పార్టీలు కదా,ఇక్కడ ఆదివాసీ జెఏసితో పనేంటి,ఆదివాసీ జెఏసి ఏర్పడిన తర్వాత సిపిఎం అనుబంధ సంఘమైన గిరిజన సంఘం ఆదివాసీ గిరిజన సంఘం అయ్యింది ఎందుకు,అదే సిపిఎం అనుబంధ సంఘమైనా యూటిఎఫ్ అర్థిక సహాయంతో చేబ్రోలు లీలా ప్రసాద్ జిఓ నెం 3 మీద కోర్ట్ కు వెళ్ళడం నిజం కాదా, అదే జిఓ 3 పునరుద్ధరించాలని అదే సిపిఎం పార్టీ అనుబంధ సంఘమైన ఆదివాసీ గిరిజన సంఘం ఇక్కడ పోరాటం చేయడం సిపిఎం ద్వంద్వ వైఖరి కాదా,కమ్యూనిస్ట్ పార్టీ కి చెందిన గిరిజనేతరులు దగ్గర ఏజెన్సీలో భూబదాలయింపు నిషేధచట్టానికి వ్యతిరేకంగా ఆదివాసీల భూములు ఆక్రమించుకొన్నారు.కమ్యూనిస్ఠ్ పార్టీ ఏజెన్సీ జిల్లా కమిటీలకు ఒక విధానం, రాష్ట్ర,కేంద్ర కమిటీలది మరో విధానమని,కమ్యూనిస్టు వర్గ దృక్పథం ప్రకారం ధనిక,పేద వర్గాలు,ఆ పేదవర్గాన్ని అమాయక ఆదివాసీ ప్రాంతాల్లోకి తీసుకొచ్చింది కమ్యూనిస్టు పార్టీ,వారే ఇపుడు ఆదివాసీ హక్కులు, చట్టాలను ఉల్లంఘిస్తున్నారని, జెఏసి జిల్లా కమిటీ సభ్యుడు పాంగి అంజీరావు తో కలిసి తీవ్రంగా ఆరోపించారు.

# కొవ్వూరులో లోక్ అదాలత్




కొవ్వూరు అస్త్రం ప్రతినిధి: రాష్ట్ర, జిల్లా న్యా య సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగ జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్ లో భాగంగ కొవ్వూరు మండల న్యాయ సేవ సంస్థ అద్వర్యం లో శనివారం కొవ్వూరు కోర్ట్ ప్రాగణం లో పెండింగ్, ప్రీ లిటిగేషన్ కేసులు పరిస్కర నిమిత్తం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు .ఈ జాతీయ లోక్ అదాలత్ లో మొత్తంమూడు బెంచ్ లను ఏర్పాటు చేసారు .ప్రీ లిటిగేషన్ కేసుల పరిస్కర నిమిత్తం ఏర్పాటు చేసిన బెంచ్ కు న్యా య మూర్తి గ 9 వ అదనపు జిల్లా జడ్జి ఎం .అనురాధ న్యాయవాది చక్ర పాణి వవహరించారు .సివిల్ కేసులు పరిస్కర నిమిత్తం ఏర్పాటు చేసి న 2వ బెంచ్ కు న్యా య మూర్తి గ సీనియర్ సివిల్ జడ్జి జి .వి .యల్ .సరస్వతి న్యాయవాదిగా ఎం .వెంకేటేష్ అదే విధం గా క్రిమినల్ కేసుల పరిస్కర నిమిత్తం ఏర్పాటు చేసిన 3 బెంచ్ కు జి.సాయి కృష్ణ న్యాయవాదిగ ఎం .రఘు రామ్ వ్యావహారించారు .ఈ లోక్ అదాలత్ లో మొత్తమ్ 324కేసులు రాజి అయ్యాయి .సివిల్ కేసులు 101 .క్రిమినల్ కేసులు 223 రాజి అయ్యాయి.57090366,రూపాలు రాజి అయ్యాయి.

## నేడు దేవరాపల్లిలో నూకాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : మండల కేంద్రమైన దేవరాపల్లి గ్రామంలోని ఎరుకలపేటలో ఆదివారం (నేడు ) శ్రీ నూకంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల 52 నిమిషాలకు ఈ ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందన్నారు. ఆలయం కార్య నిర్వహణ ధర్మకర్త కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు ఆధ్వర్యంలో జరుగుతుందని, ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి హాజరుకానున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు.



## పెద్దింటమ్మ జాతర మహోత్సవం పోస్టర్లు ఆవిష్కరణ

రోలుగుంట అస్త్రం ప్రతినిధి: మండలంలోని కుసర్లపూడి గ్రామంలో శ్రీ పెద్దింటమ్మ జాతర మహోత్సవం పోస్టర్లు ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుసర్లపూడి గ్రామంలో పెద్దింటమ్మ జాతర మహోత్సవాలు జరుపుకోవాలని సన్నహాలు జరుగుతున్నాయి.దీనిలో భాగంగా గ్రామ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొని పోస్టల్ ఆవిష్కరణ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ ఉపసర్పంచ్ సబ్బవరపు పెద్ది నాయుడు,మాజీ ఎంపిటిసి గొల్లు రమణ,చెరువు అధ్యక్షులు అనిమిరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొని ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని గ్రామ కమిటీ గ్రామస్తులు సహకరించాలని కోరారు.

## జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

రోలుగుంట అస్త్రం ప్రతినిధి: జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎం ఎస్ రాజు మాట్లాడుతూ మహిళలకు మంచి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మహిళలతోపాటు గ్రామ సర్పంచ్ లక్ష్మి ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ,మండల పార్టీ అధ్యక్షులు కునుమూరు చంద్రమౌళి, పంచాద చంద్ర,ఎంపీడీవో నాగేశ్వరరావు,అధికారులు పాల్గొన్నారు.



సామాన్యుడి ఆయుధం
# అస్త్రం
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
విశాఖపట్నం | అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం 9 -3-2025

## గ్రామదేవత సింహద్వారం ధ్వంసం చేసిన క్వారీ లారీలు

### అడ్డుకున్న గ్రామస్తులు





రోలుగుంట అస్త్రం ప్రతినిధి:రోలుగుంట మండలం శరభవరం రెవిన్యూలో బొప్పెన కన్స్ట్రక్షన్ క్వారీ ప్రొప్రైటర్ గంగాధర్ చౌదరి కొన్ని నెల క్రితం ప్రారంభించారు.క్వారీలో భారీ లారీలతో వచ్చి ఓవర్ లోడింగ్ తో తీసుకెళ్తున్నారు. దీనివలన బుచ్చింపేట గ్రామంలో సింహద్వారాన్ని అర్ధరాత్రి సమయంలో నల్ల క్వారీ లారీలతో పూర్తిగా ధ్వంసం చేశారు.దీన్ని గమనించిన గ్రామస్తులు ఆందోళన చెందారు.ఈ క్వారీ లారీలు భారీ లోడింగ్ తో వస్తు సింహద్వారాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. పైన ఉన్న అమ్మవారి విగ్రహాన్ని కొంత దూరాన్ని తీసుకెళ్లి నామరూపకాలు లేకుండా చేశారు.హిందూ సాంప్రదాయాలు మనోభావాలు దెబ్బతినేలా చేస్తున్నారని అన్నారు.ఈ క్వారీ వలన శరభవరం, గుర్రంపేట రాజన్నపేట వడ్డీప,నగరం సాగు రైతులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు.కొన్ని రోజుల క్రితం క్వారీ వలన ఒక సాగు రైతు జనమూరి సత్తిబాబు తన ప్రాణాల మీదికి తీసుకొచ్చారు. తన పొలం పూర్తిగా ధ్వంసం అవుతుందని అడ్డుకోగా అతనిపై కొంతమంది రౌడీషీటర్లతో దౌర్జన్యం చేశారు.మనస్థాపానికి గురై పాయిజన్ తీసుకున్నారు. వెంటనే క్వారీ యాజమాన్యానికి ఎలాంటి ఆరోపణ ఉండకూడదని నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాకు ప్రభుత్వ అధికారులు పట్టించుకోరు పాలకులు స్పందించారని సాగు రైతులు అన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఏడి మైనింగ్ అధికారులు స్పందించాలని రైతుల కోరారు.

## అనుమతులు లేని మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ మూసివేయాలి..

### ఎం.జ.ఎస్. ఎస్. జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు




పాచిపెంట అస్త్రం ప్రతినిధి: పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేకుండా మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ లను మూసివేయాలని మన్యం గిరిజన సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మంచాల ఈశ్వరరావు మరియు ఎం గిరిధర్ సంబంధిత శాఖ జిల్లా అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.అందులో భాగంగా పాచిపెంట మండల కేంద్రంలో గల శ్రీ బాలాజీ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ కందుల ప్రదీప్ అలియాస్ నాని బాబు ఎటువంటి అర్హత లేకుండా ఫార్మసిస్ట్ గాని, కంప్యూటర్ ఫ్రెండ్,కార్బన్ కాపీ గాని, కొనుగోలు బిల్లు ఇవ్వటం గాని లేదు. అర్హత లేకుండా ఫస్ట్ ఎయిడెడ్ చికిత్స చేయడం వలన కొంతమంది గిరిజన పిల్లలు చికిత్సలు వికటించి చనిపోవడం జరిగిందని మంచాల ఈశ్వరరావు తెలిపారు. దీని విషయమై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు నిర్వహించగా ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నటువంటి శ్రీ బాలాజీ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ మూసి వేయడం జరిగిందని ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని తెలిపారు.పార్వతీపురం మన్యం జిల్లాలో ఇటువంటి ప్రభుత్వా అనుమతులు లేకుండా నడపబడుతున్నటువంటి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ ను సంబంధిత జిల్లా ఔషధా నియంత్రణ అధికారులు తనిఖీలు నిర్వహించి మూసివేయాలని మన్యం గిరిజన సేవా సంఘం తరపున జిల్లా అధ్యక్షుడు మంచాల ఈశ్వరరావు గిరిధర్ కోరుతున్నారు.

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం




కొవ్వూరు అస్త్రం ప్రతినిధి : మహిళలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ దేవతలు పూజింప పడతారని కొవ్వూరు లైన్స్ క్లబ్ అధ్యక్షులు మద్దిపాటి సత్యనారాయణ అన్నారు. మద్దిపాటి సత్యనారాయణఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కొవ్వూరు పట్టణంలో శనివారం వాత్సల్య వృద్ధాశ్రమం నందు వృద్ధులకు నిరంతరం సేవలందిస్తున్న రేనా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు గౌరీ శాంతి ని దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మద్దిపాటి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులను అత్తమామలను పట్టించుకోలేని నేటి సమాజంలో ఒంటరి వృద్ధులను చేరదీసి వారికి పరిచర్యలు చేయడం సామాన్య విషయం కాదన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ సేవారంగంలో తనకున్న ప్రత్యేకతను చాటుకున్న గౌరీ శాంతిని సత్కరించుకోవడం సంతోషదాయకం అన్నారు ఈ కార్యక్రమంలో కొవ్వూరు లైన్స్ క్లబ్ సభ్యులు నాలం శ్రీనివాసరావు, యనమదల సుబ్రహ్మణ్యం, కలగర వెంకట్రావు, ముళ్ళపూడి కాశీ విశ్వనాథ్, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, మహమ్మద్ హుస్సేన్,సూరిబాబు లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు కలిసిన సింహాద్రప్పుడు



చోడవరం అస్త్రం ప్రతినిధి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం శాసన మండలి సభ్యులు గాదె శ్రీనువాసులు నాయుడు ని చోడవరం మండలం దుడ్డు పాలెం హైస్కూల్ ఉపాధ్యాయుడు,అనకాపల్లి ఏపీ సిపి ఎస్ఇ ఏ జిల్లా ఆర్థిక కార్యదర్శి, జి సింహాద్రప్పుడు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎస్ , మిత్రుల కు రావలిసిన బకాయిలు తక్షణమే ఇప్పించండానికి ప్రయత్నించాలని ని కోరారు. ఎందుకు ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు స్పందిస్తూ ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించే అవకాశం ఉందని తెలిపారని సింహాద్రి తెలిపారు.



## చదువుతోనే మహిళా సాధికారత

### ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు అస్త్రం ప్రతినిధి : మహిళను గౌరవించడం మన బాధ్యత ఎమ్మెల్యే ముప్పిడి మహిళల చదువుతోనే మహిళా సాధికారత సాధ్యమని, నేటి సమాజంలో మహిళలే అన్ని రంగాలలో రాణిస్తున్నారని కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొవ్వూరు పట్టణంలోని మునిసిపల్ కార్యలయం నందు మెప్మా ఆద్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు వంటింటేకే పరిమితం కాకుండా ప్రతి ఇంటిలోని మహిళలు చదువుకొని సమాజ, కుటుంబ శ్రేయస్సు వైపు అడుగులు వేయ్యాలని సూచించారు. మహిళలకు ఆస్థి హక్కు కల్పించింది తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక తారక రామారావు అని గుర్తు చేసారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించబడిందని, ఉద్యోగ ఉపాది, రాజకియ్యంగా మహిళలు మరింతగా రాణించాలని తెలిపారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, మునిసిపల్ చైర్మపర్సన్ బావన రత్నకుమారిలతో పాటు మెప్మా సిబ్బందిని దుశాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, తెలుగుదేశం పార్టి ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మాజీ మునిసిపల్ చైర్మెన్ సురపనేని చిన్ని, పెనుమాక జయరాజు, మెప్మాసిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మహిళ దినోత్సవం

### మహిళలకు ఆటలా పోటీలు

### జ్ఞాపికాలను అందించిన :కృష్ణ కుమారి.



దుంబ్రిగుడ :అస్త్రం ప్రతినిధి: ల్లూరి జిల్లా దుంబ్రిగుడ కేంద్రంలో మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పురుషులతో సమానంగా మహిళలు అని రంగంలో ముందంజలో ఉండాలని మహిళల చదువుతూనే మహిళా సాధికారత సాధ్యమని నేటి సమాజంలో మహిళలు అని రంగాలలో రాణిస్తూరని మానవ హక్కుల నేరనిరోధక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కమిడి కృష్ణకుమారి,మహిళలకు సూచించారు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దుంబ్రిగుడ కేంద్రంలో మహిళలకు ఆ సంఘం నాయకుడు కమిడి రవీంద్ర ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు ఈ నేపథ్యంలో విజేతాలుగా నిలిచిన మహిళలను జ్ఞాపి కాలను బహుమతులను రాష్ట్ర అధ్యక్షురాలు కృష్ణ కుమారి అందజేశారు.ఈ సందర్భంగా మానవ హక్కులను నేర నిరోధక సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు కమిడి కృష్ణ కుమారి,మాట్లాడుతూ మహిళల చదువుతోనే మహిళా సాధికారత సాధ్యమని, నేటి సమాజంలో మహిళాలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని మహిళలు వంటింటేకే పరిమితం కాకుండా ప్రతి ఇంటిలోని మహిళలు చదువుకొని సమాజ, కుటుంబ శ్రేయస్సు వైపు అడుగులు వేయ్యాలని సూచించారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించబడిందని, ఉద్యోగ ఉపాది, రాజకియ్యంగా మహిళలు మరింతగా రాణించాలని తెలిపారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళాలు మానవ హక్కుల నేల నిరోధక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కమిడి కృష్ణ కుమారిని దుశాలువ కప్పి ఘన సన్మానం చేశారు. . ఈ కార్యక్రమానికి శృతి పల్లవి మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

చోడవరం అస్త్రం ప్రతినిధి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని చోడవరం కో-ఆపరేటివ్ కాలనీ శ్రీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిబిరంలో 350 మంది రోగుల హాజరై వివిధ రకాల అనారోగ్య సమస్యలపై తనిఖీలు నిర్వహించుకున్నారు. ఉచితంగా రోగులకు బిపి షుగర్ పరీక్షలు ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యులు వైద్య నిపుణులు, ఎముకల వైద్య నిపుణులు తనిఖీలు నిర్వహించారు అందరికీ ఉచితంగా ముందు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ ట్రస్ట్ నిర్వాహకులు కండెల్లి వెంకటరావు, జింజోరి అప్పారావు వసంత పైడిరావు, భూపతి రాజు , ఎర్రంశెట్టి వరప్రసాద్ , వేచలపు ప్రకాష్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.గీతం మెడికల్ అండ్ సైన్స్ ఇన్సిట్యూట్ వారి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

## మహిళల మౌలిక సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమిద్దాం!

చోడవరం అస్త్రం ప్రతినిధి : అనకాపల్లి జిల్లా చోడవరం లోని నూకాంబిక కళ్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా పోరాట దినం సందర్భంగా శనివారం స్త్రీ విముక్తి సంఘటన కొత్తూరు శివాలయం నుండి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగినసభకు అధ్యక్షత వహించిన స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ ఓ.వి.వి.ఎస్. లక్ష్మి కుమారి మాట్లాడుతూ మహిళా దినోత్సవం వెనకున్న పోరాటాలని మహిళా త్యాగాలని అపహాస్యం చేసే విధంగా మహిళా దినోత్సవ పోరాట స్ఫూర్తిని పక్కదారి పట్టించే విధంగా నేడు మార్చి 8ని జబర్దస్త్ ప్రోగ్రాంలతోనూ పార్టీలుగాను సెలబ్రేట్ చేస్తూ మహిళలనుకించపరుస్తున్నారని.అసహనం వ్యక్తం చేశారు. రచయిత సూర్య ప్రకాష్ మాట్లాడుతూ పెరుగుతున్న ఆర్థిక అవసరాలరీత్యా అన్ని రంగాల్లోనూ మహిళల శ్రమ అవసరం అవుతున్న నేటి పరిస్థితుల్లో కనీస అవసరాలు మహిళలకు పని ప్రదేశంలో అవసరమైన భద్రత, సదుపాయాలు లేకపోవడం విచారించాల్సిన విషయం అన్నారు. దానికోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. జనసాహితీ జిల్లా అధ్యక్షులు ఐటిఆర్వి శివాజీ రావు మాట్లాడుతూ ప్రజలపై పెరుగుతున్న సామ్రాజ్యవాద దోపిడి అణచివేతలని గుర్తించనీయకుండా ప్రజల్లో గూడుకట్టుకుని ఉన్న అశాంతిని అణిచివేయడానికి పాలకులు మతోన్మాదాన్ని, కుల,మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని దీనివలన ఎక్కువగా ఇబ్బందులకు గురయ్యేది శ్రమజీవులు, ముఖ్యంగా మహిళలే అని పేర్కొన్నారు..వక్తలు ఉపన్యశించిన తర్వాత ఇంటా బయట స్త్రీలు చేసే కనిపించని పనిని చర్చిస్తూ మహిళా కళాకారులు " హౌస్ వైఫ్ " అనే చిన్ననాటికను ప్రదర్శించారు. ఓ.పి.డి. ఆర్ జిల్లా కన్వీనర్ గౌరీ శంకర్ నవ యువ సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎన్.భాస్కర్ ఉపాధ్యాయులు శ్రీను, మత్స్యలింగం ప్రసంగించారు.

